# పాత జ్ఞాపకాలు

## ఐ. రమేష్ బాబు (రవి) - 1982, 10వ తరగతి

నేను యింటూరి రమేష్‌బాబు, తండ్రి ఐ.జగ్గయ్య, చేకూరపాడు గ్రామం. మా గ్రామంలో ఉన్న పాఠశాలలో 6వ తరగతినుండి 10వ తరగతివరకు చదువుకున్నాను. 1982లో బయటకు వచ్చినాము.

మన పాఠశాల పేరు మహా అద్భుతం. ఎలా అనగా శ్రీ వేణుగోపాలస్వామి సంస్కృత పాఠశాల. ఇది ఒంగోలు (ప్రకాశం జిల్లాలో) తాలూకాలో ప్రప్రథమంగా సంస్కృతం నేర్పించే పాఠశాల. ఆ పాఠశాల మన గ్రామంలో నిర్మించడం మన గ్రామంతో పాటు చుట్టుప్రక్కల వారు మూడు గ్రామములు వచ్చి చదువుకోవడం మన వూరికి స్కూలుకు పెట్టిన ప్రతిభ.

ఇకపోతే మన గురువులు అంటారా, గురువులమే బయట ఎన్ని బాధలు ఉన్నా అవి కనబర్చకుండా పిల్లలనందరిని ఆనందపరచి సంతోషపెట్టే గుణం కలవారు అవడం, మనం ఇంత పై స్థాయికి పోవడం ఒక కారణం. మన గురువులు మనకు సంస్కృతంతో కూడిన ఉన్నత విద్యను అభ్యసించిన మేధావులు వారిని మనం మనఃస్ఫూర్తిగా సన్మానము చేసుకుని పాదాభివందనం చేయు అవకాశము కలిగినందులకు ధన్యవాదములు. కల్పించిన శ్రేయోభిలాషులకు, పెద్దలకు చిన్నలకు నా మనస్ఫూర్తిగా నమస్కారములు.

ఇకపోతే పాఠశాల ప్రారంభమునుండి అనేక క్రమశిక్షణ కార్యక్రమాలు పెద్దలను ఎలా గౌరవించాలి అనేక విధాలుగా చాలా నేర్పినారు. మన పాఠశాల వలన ఈ అవకాశం వచ్చినందులకు చాలా ఆనందంగా ఉన్నది. తరువాత మన పాఠశాలలో మొదట నుంచే చెట్లు నాటే కార్యక్రమాలు పరిసరాలు పరిశుభ్రత గురించి సూర్యకుమారి గురువులు గారు బాగా నేర్పినారు. క్రమశిక్షణా విధానం పని తీరును గురవయ్య గురువుగారి దగ్గర నుంచి నేర్చుకున్నాము.

ఇంకా సంస్కృతంలోని శ్లోకాలు, పద్యాలు, కాళిదాస మహా కావ్యము, వాల్మికి రచనలు ఇవి అన్నీ ఎంతో క్షుణ్ణంగా పఠించడం ఒక సుధాకరు పంతులుగారికే పరిమితమైనది. ఆయన శ్లోకాలు చెబుతుంటే ఎంతో మధురంగా విన్న రోజులు చాలా ఉన్నాయి. ఇప్పుడు ఏ దేవాలయంకో పోయి అగజానన పద్మార్కం అన్న వెంటనే మన పాఠశాల గుర్తుకు వస్తుంటుంది. మన పాఠశాల చదువును, పాఠశాలను ఒక దేవాలయంగా భావించవచ్చును.

అలా అని కాకుండా ప్రతి శనివారము సాయంత్రము ఒక వేదికగా అమర్చి చర్చలు జరుగుతూ ఉంటారు. అందరు కలసి కొన్ని తెలియని విషయాలు చాలా తెలుసుకునేవాళ్ళం. అప్పుడు నేను చదువుకునే సమయంలో ఈ కార్యక్రమాలకు కార్యదర్శిగా పనిచేసినాను. ఆ తీపి జ్ఞాపకాలు ఇంకా గుర్తుకు వస్తుంటాయి. అలా అని ఆటలపోటీలలో ఏమి తక్కువ తినలేదు. రాష్ట్రస్థాయిలో బాలికల కబాడి విభాగంలో మన పాఠశాల పేరు మ్రోగింది. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా అనుభూతులు ఉన్నాయి. ఇది నాకు తెలిసిన మన పాఠశాల జ్ఞాపకాలు. ధన్యవాదములు.